నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 10 మార్చి 2025 | HYDERABAD

ఇండియా-న్యూజిలాండ్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను ఆదివారం నగర ప్రజలు ఆసక్తిగా తిలకించారు. భారత్ అద్భుత విజయం సాధించడంతో సంబురాలు చేసుకున్నారు. అంతకుముందు బన్సీలాల్‌పేట్‌లో బండారి శ్రీనివాస్ తన కుమార్తె వివాహ వేడుక జరుగుతున్న కల్యాణ మండపంలో క్రికెట్ మ్యాచ్ లైవ్ ప్రసారాన్ని చూసేందుకు ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేశారు. పెండ్లికి వచ్చిన బంధువులు వధూవరులను ఆశీర్వదించడంతో పాటు మ్యాచ్ కూడా చూస్తూ అక్కడే కూర్చున్నారు. -సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట

ఆదివారం ఉదయం వరకు చిలుకానగర్‌రోడ్డులో తొలగించని వ్యర్థాలు

ప్రజా పాలనపై వ్యతిరేకత

కాంగ్రెస్ పాలనలో గ్రేటర్ ప్రజలకు తప్పని తిప్పలు తాగునీటి వెతలు.. కరెంటు కోతలతో జనం అవస్థలు పారిశ్రామిక కాలుష్యంతో అల్లాడుతున్న శివారు కాలనీలు నిత్యం ఏదో ఒక సమస్యతో రోడ్డెక్కుతున్న కాలనీ వాసులు సర్కారు తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు

సిటీబ్యూరో: కాంగ్రెస్ సర్కార్ తీరుతో గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే పలు కాలనీల వాసులు మంచినీరు, కరెంటు కోతలు, కాలుష్యంతో అల్లాడుతున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో పక్కా ప్రణాళికతో నగర ప్రజలకు సీజన్‌తో సంబంధం లేకుండా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకున్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ఏలుబడిలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కరెంటు కోతలపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ సర్కారుపై మీమ్స్‌తో సెటైర్లు వేస్తున్నారు. ఎండాకాలంలో నీటి కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక రూపొందించకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. బండ్లగూడ పద్మశ్రీ హిల్స్ కాలనీ వాసులు రెండు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. నిజాంపేట, బాచుపల్లి, ప్రగతి నగర్‌లో పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఇలా గ్రేటర్ పరిధిలో ప్రజలు ప్రభుత్వంపై నిరసన గళం ఎత్తుతున్నారు.

తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న పద్మశ్రీహిల్స్ కాలనీవాసులతో చర్చిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్

హామీలొద్దు..మంచినీళ్లివ్వండి

బండ్లగూడ: బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. పద్మశ్రీ హిల్స్ కాలనీవాసులు రెండు రోజులుగా రిలే నిరాహార దీక్షకు దిగారు. ఆదివారం బీజాపూర్ ప్రధాన రహదారిపై బిందెలతో మహిళలు ధర్నా నిర్వహించారు. తమ కాలనీకి నీరు సరఫరా చేసేంత వరకు ధర్నాను విరమించేది లేదన్నారు. కాలనీలో సుమారు 1200 కుటుంబాలు నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు అనేక మంది ప్రజా ప్రతినిధులు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

హామీలు వద్దు..

పద్మశ్రీ హిల్స్ కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో బీజాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించడంతో కాంగ్రెస్ నాయకులు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ అక్కడికి చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఆగ్రహించిన కాలనీవాసులు 'హామీలు మాకు వద్దు సార్' అంటూ సమాధానం ఇవ్వడంతో పాటు వెళ్లిపోవాలని సూచించారు. కాగా, జ్ఞానేశ్వర్ అధికారులతో వెంటనే ఫోన్లో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం అవసరమైన నిధులను కేటాయించేందుకు మంత్రులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

వాటర్ ట్యాంకును బుక్ చేస్తే క్యాన్ నంబర్ అడుగుతున్నారు

పద్మశ్రీ హిల్స్ కాలనీ ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా నీరు సరఫరా లేకపోవడం బాధాకరం. ట్యాంకర్ కోసం ఆన్లైన్లో బుక్ చేస్తే వారు క్యాన్ నంబర్ అడుగుతున్నారు. నల్లా కనెక్షన్ లేనప్పుడు క్యాబ్ నంబర్ ఎక్కడి నుంచి వస్తుందని అడిగితే.. క్యాన్ నంబర్ ఉన్నవారికి నీటి సరఫరా చేస్తామంటున్నారు.

- కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్ రెడ్డి.

ఇబ్బందులు పడుతున్నాం

పద్మశ్రీ హిల్స్‌కాలనీకి నల్ల కనెక్షన్లు లేకపోవడంతో పాటు మంచినీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. అనేక సార్లు ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ప్రయోజనం లేకుండా పోయింది. - స్థానికురాలు గాయత్రి

ప్రాణాలు పోతున్నా..పట్టించుకోరా..

పరిశ్రమల కాలుష్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న స్థానికులు, చిన్నారులు

దుండిగల్: బాచుపల్లిలో ఆదివారం పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా నిజాంపేట కార్పొరేషన్ ప్రజలు ర్యాలీ నిర్వహించారు. పీసీబీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులుతో ర్యాలీ తీశారు. ఐడీఏ బొల్లారం తదితర ప్రాంతాల్లోని కొన్ని పరిశ్రమలు రాత్రి పొద్దుపోయిన తర్వాత, తెల్లవారుజామున హానికారకమైన విష వాయువులను గాలిలోకి విడుదల చేస్తుండడంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఈ విషయమై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు.

పీసీబీ ఎందుకు నిర్లక్ష్యం చేస్తోంది

పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించడంలో పీసీబీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియడం లేదు. కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలకు ఎందుకు కొమ్ముకాస్తున్నారు. ఇప్పటికే కాలుష్యంతో బాచుపల్లి పరిధిలో కొందరు చనిపోతున్నారు. పీసీబీని ఎందుకు పట్టించుకోవడం లేదు.

- రవి, బాచుపల్లి

ఆందోళన ఉధృతం చేస్తాం

పీసీబీ అధికారులు, ప్రభుత్వం గాని పట్టించుకోవడం లేదు. వాయు కాలుష్యంతో ప్రజలు ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి కాలుష్యకారమైన పరిశ్రమలను మూసివేయాలి. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం.

-శ్రీలక్ష్మి నిజాంపేట

కరెంట్ కోతలపై నెటిజన్ల ఆగ్రహం

-ఎక్స్ వేదికగా పోస్టుల వెల్లువ

టీజీఎస్‌పీడీసీఎల్ నిర్లక్ష్యంపై మండిపాటు తమ ప్రాంతాల్లో కరెంట్ పోయిందంటూ పోస్టులు

సిటీబ్యూరో: తెలంగాణలో విద్యుత్ కోతలు లేవంటూ ఓ వైపు ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తుంటే, మరోవైపు కరెంట్ కోతలపై సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ కోతల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు ప్రస్తావిస్తూ నెటిజన్లు ఎక్స్ వేదికగా టీజీఎస్‌పీడీసీఎల్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 24 గంటలు కరెంట్ ఇవ్వాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుండగా, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం సిటీలో కరెంట్ కోతలే లేవంటూ ప్రకటిస్తున్నారు. కానీ ఇందుకు విరుద్ధంగా హైదరాబాద్‌లో పవర్ కట్స్ అంటూ నెటిజన్లు పోస్టు చేస్తున్న వివరాలు అప్రకటిత కరెంట్ కోతలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఫిర్యాదులకు స్పందన కరువు..

ఫిబ్రవరి నుంచి అప్రకటిత కరెంట్ కోతలు పెరిగాయంటూ వినియోగదారులు తమ ప్రాంతాలకు కేటాయించిన ఫోన్ నంబర్లకు ఎన్ని సార్లు కాల్ చేసినా స్పందన లేదని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఆయా ఏరియాల కరెంట్ ఆఫీసులకు కాల్ చేస్తే అసలు ఎత్తే వారే లేరని, ఒకవేళ కాల్ రిసీవ్ చేసుకున్నా కరెంట్ ఎప్పుడు వస్తుందో ఖచ్చితంగా చెప్పలేమంటున్నారని కొందరు వినియోగదారులు చెప్పారు. కొన్నిచోట్ల మెయింటెనెన్స్ కోసమంటూ ప్రకటించిన కోతలకు సంబంధించిన వాటిపై కంప్లైంట్స్ వస్తున్నాయంటూ అధికారులు చెబుతున్నప్పటికీ నెటిజన్లు రాత్రివేళల్లో, మధ్యాహ్నం వేళల్లో అప్రకటిత కోతలకు సంబంధించి పోస్ట్ చేస్తున్న ఫొటోలు, వివరాలు స్పష్టంగా ఉంటున్నాయి. హబ్సిగూడ, సైబర్‌సిటీ, మేడ్చల్ సర్కిళ్లలో అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో కోతలు లేకుండా డిమాండ్‌కు తగ్గట్లుగా సప్లై అందించడానికి సమ్మర్ ప్లాన్ అమలు పరచడంలో ఫెయిలయినట్లుగా వినియోగదారులు చెబుతున్నారు.

నెటిజన్ల ట్వీట్లు ఇలా ఉన్నాయి..

విజయ్‌జైన్ అనే నెటిజన్ తన ఎక్స్ వేదికగా రామంతపూర్‌లో కరెంట్‌కోతలపై పోస్ట్ చేశారు. ఎలాంటి ముందస్తు షెడ్యూల్ లేకుండా, ప్రకటన లేకుండా రామంతపూర్‌లోని శ్రీనివాసపురం కాలనీ స్ట్రీట్‌నం.2లో పవర్‌కట్ ఉందన్నారు. తమ ఏరియాలోనే కరెంట్ లేదని పోస్టులో పేర్కొన్నారు. హబ్సిగూడ ఆపరేషన్స్ ఎస్ఈ స్పందిస్తూ సమస్యను తొందరగా పరిష్కరిస్తామన్నారు. దీనికి సమాధానంగా తమ ప్రాంతంలో కరెంట్ పోయిందంటూ ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు కాల్ చేసినా స్పందించడం లేదన్నారు. వివేక్ షెనాయ్ అనే మరో నెటిజన్ వెల్‌కమ్ పవర్ కట్ ఇన్ హైదరాబాద్ అంటూ పోస్ట్ చేశారు. సైబర్‌సిటీ, చందానగర్‌లో కరెంట్‌కోతలకు సంబంధించి ఒక మెసేజ్ కూడా రావడం లేదని, ఫోన్ చేసినా సిబ్బంది నుంచి నిర్లక్ష్యంగా సమాధానం వస్తున్నదన్నారు. శ్రీధర్ అనే మరో నెటిజన్ వేసవి ప్రారంభంలోనే హైదరాబాద్‌లో పవర్ కట్స్ ప్రారంభమయ్యాయంటూ మండిపడ్డారు. తార్నాక స్ట్రీట్ నంబర్ 1లో కరెంట్‌కోతలకు సంబంధించిన ఫొటో షేర్ చేస్తూ గంటన్నరకు పైగా కరెంట్ పోతున్నదని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో అయోమయం

పార్టీ క్యాడర్‌లో నిరుత్సాహం మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇదీ

మేడ్చల్, మార్చి9(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో అయోమయ పరిస్థితి నెలకొంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పార్టీ నేతల్లో సమన్వయ లోపంతో క్యాడర్‌లో పూర్తిగా నిరుత్సాహం నెలకొంది. అసలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నట్లే లేదనిపిస్తుందని ఆ పార్టీ క్యాడర్ చర్చించుకోవడం చర్చనీయాశంగా మారింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో ఇదే పరిస్థితి ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ కార్యకర్తల ఉత్సాహం నీరుగారుతున్నది.

సమీక్షా సమావేశాలకు రాని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి..

జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం తెచ్చేలా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రీధర్‌బాబు జిల్లా కలెక్టరేట్‌లోనైనా సమీక్షా సమావేశాలు నిర్వహించలేదు. పథకాలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తే జిల్లాలో ఎలాంటి ప్రొటోకాల్ లేని నేతలు ఏదైనా ఉంటే మంత్రి శ్రీధర్‌బాబుకు చెప్పుకొనే అవకాశం ఉంటుందని భావించినా.. ఇలాంటి కార్యక్రమాలు జరగకపోవడంతో పార్టీ క్యాడర్ మరింత నిరుత్సాహానికి గురి చేస్తున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలోని నేతలను సమన్వయం చేసి ప్రభుత్వ పెద్దల సహకారం అందిస్తే తప్ప .. కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం నిండేలా కనిపించడం లేదు.

నియోజకవర్గ ఇన్‌చార్జీలు అసంతృప్తి

జిల్లాలో పోటీ చేసి ఓడిపోయిన నేతలకే నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఇచ్చినా ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో అసంతృప్తికి లోనవుతున్నట్లు తెలుస్తున్నది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పథకాలకు సంబంధించి పెద్దగా పనులు జరగకపోవడం వీరికి ఎలాంటి ప్రొటోకాల్ లేకపోవడంతో కార్యకర్తలు వచ్చి నియోజవర్గ ఇన్‌చార్జీలను కలిసిన ఎలాంటి పనులు కాకపోవడంతో కార్యకర్తలకు ఎలాంటి న్యాయం జరగపోవడంతో మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రారంభించిన వీరికి అధికారుల నుంచి ప్రొటోకాల్ ఆహ్వానం అందకపోవడంతో పోలేని పరిస్థితి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు కేటాయించకపోవడంతో నాయకులు నిరుత్సాహానికి గురువుతున్నారు. ప్రభుత్వ పెద్దలు సహకరించకపోవడం నామినేటెడ్ పోస్టులను జిల్లాకు ఇవ్వకపోడంతో కాంగ్రెస్ కార్యకర్తలు పనులు చేయించకునే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు. దీనికి తోడు జీహెచ్ఎంసీ పరిధిలో నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇంటి పథకం, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందిచకపోవడంతో ప్రజలను ఎలా కలిసేదని కార్యకర్తలు నాయకులు వద్ద చెప్పుకొంటున్నారు. జిల్లాలోని పెద్ద నాయకుల మధ్య సమన్వయ లోపంతో అసలు పార్టీ సమీక్షా సమావేశాలు జరిగిన దాఖలాలు అసలే కనిపించడం లేదు.

మ్యూల్ ఖాతాలతో కొత్త పన్నాగం..

ఎక్కువగా ప్రైవేటు బ్యాంకుల అకౌంట్లే ఉపయోగిస్తున్న సైబర్ నేరగాళ్లు

డేటా ప్రొటెక్షన్ యాక్ట్ లేక మరింత రెచ్చిపోతున్న వైనం



అమాయకుల నుంచి దోచేస్తున్న సొమ్మును ట్రాన్స్‌ఫర్ చేయడానికి సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలే కీలకంగా మారాయి. కాజేసిన సొమ్మును పలు బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసి, అవకాశం ఉన్న చోట విత్ డ్రా చేసుకుంటున్నారు. అలాకాకపోతే ఆన్‌లైన్‌లో కూపన్ల కొనుగోలు, క్రిప్టో కరెన్సీలోకి మార్చి విదేశాలకు పంపుతున్నారు. అయితే ఈ అకౌంట్స్ కోసం ఎక్కువగా ప్రైవేటు బ్యాంకులకు చెందిన అకౌంట్స్‌నే వాడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సుమారు 62 శాతం లావాదేవీలు ఈ అకౌంట్స్‌లోనే చేస్తున్నారని వారు పేర్కొన్నారు. బ్యాంకులు పర్సనల్ వెరిఫికేషన్ లేకుండా కరెంట్ ఖాతాను తెరుస్తుండడంతో సైబర్ నేరగాళ్లకు అనుకూలమవుతోంది. డేటా ప్రొటెక్షన్ యాక్ట్ సరిగా అమలు లేకపోవడంతో నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు.

భూముల వేలంపైనే ఆశలు

టీజీఐఐసీ భూముల వేలంతో తెరమీదకు హెచ్ఎండీఏ వెంచర్లు

సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలో హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన భూములకు ఇప్పుడు డిమాండ్ లేకుండా పోయింది. అన్ని సౌలతులతో డెవలప్ చేసిన ప్లాట్లను కూడా విక్రయించలేకపోతుంది. దీనికి మార్కెట్‌లో నెలకొని ఉన్న సందిగ్ధ పరిస్థితులే కారణం. తాజాగా హైదరాబాద్ కేంద్రంగా ప్రైమ్ ఏరియాల్లో భూములను వేలం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాల భూములను వేలం వేయాలనే ప్రతిపాదనలు తెరమీదకు వచ్చాయి.

400 ఎకరాల విస్తీర్ణంలో..

గచ్చిబౌలి కంచలో 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న టీజీఐఐసీ భూములను విక్రయంతో భూముల వేలంపై మరోసారి చర్చ మొదలైంది. ఖజానా నింపుకొనేందుకు కాంగ్రెస్ సర్కారు భూములను విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే రేవంత్ సర్కార్ వేలానికి కసరత్తు ప్రారంభించడంతో హెచ్ఎండీఏ పరిధిలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల వేలం ప్రక్రియలో మళ్లీ కదలిక వచ్చింది.

చిగురించిన ఆశలు...

బంజారాహిల్స్, బుద్వేల్, వంటి కీలకమైన ప్రాంతాల్లోని వెంచర్లను వేలానికి సిద్ధం చేస్తున్నారు. కానీ మార్కెట్ దారుణంగా ఉండటంతో వేలానికి హెచ్ఎండీఏ ముందుకు రావడం లేదు. అసలే మార్కెట్‌లో ఉన్న ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకుని, ఆచితూచి అడుగులు వేస్తుండగా... టీజీఐఐసీ భూముల వేలంతో హెచ్ఎండీఏకు ఆశలు చిగురించాయి. గతంలో హెచ్ఎండీఏకే భారీ ఆదాయం సమకూరిన నేపథ్యంలో... ప్రస్తుత మార్కెట్ పరిస్థితి ప్రకారం ఆ స్థాయిలో రెవెన్యూ రాకపోయినా కనీసం రూ. 3వేల కోట్లు వచ్చినా... హెచ్ఎండీఏ చేపట్టనున్న ప్రాజెక్టులకు భూసేకరణకు సరిపోతుందనే అంచనాలున్నాయి. ఇదిలా ఉంటే టీజీఐఐసీ ద్వారా నిర్వహించే భూముల వేలం ద్వారా ప్రభుత్వం రూ.25 నుంచి 30 వేల కోట్ల నిధులు సమకూర్చుకోవాలనే అంచనాతో ఉంది. ప్రభుత్వం వేలంపై వచ్చే రెవెన్యూపై పెట్టుకున్న ఆశలతో... హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ స్వరూపం తేలిపోనున్నది.

ప్రముఖ విద్యా సంస్థ మర్రి లక్ష్మణ్ రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ (ఎంఎల్ఆర్) యూఎస్ఏలోని డల్లాస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించింది. ఎం ఎల్ ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి యూఎస్ఏ లోని అన్ని ప్రదేశాల్లో ఉన్న ఎంఎల్ఆర్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కేక్ కట్ చేసి.. సమ్మేళనాన్ని ప్రారంభించారు.

- దుండిగల్